


నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

## ఎన్టీఆర్ కృష్ణా

మంగళవారం 26 ఆగస్టు 2025 పేజీలు 8


# ఇదెంది సారు.. ఇలా చేశారు..?

- ఆందోళనలో అభ్యర్థులు...!
- ఆరు సంవత్సరాల పైగా ఎదురుచూశాము, కష్టపడ్డాం....
- ఏ సర్టిఫికెట్ ప్రధానం...?
- సర్టిఫికెట్ వెరిఫికేషన్‌లో దేన్ని అనుమతిస్తారు..?
- అభ్యర్థులలో నెలకొన్న ఉత్కంఠత
- మా పరిస్థితి ఎంటో అర్థం కావటం లేదు...
- అసలు సర్టిఫికెట్ ఆఫ్ రెసిడెన్స్ సివికి ప్రధానమెనా...?
- మొన్నోకలా... నిన్నోకలా.. ఇలా అయితే మేమేమికావలి...
- ఎందుకు మా మీద ఈ కక్ష....
- ఎంతో కష్టపడి క్వాలిఫై అయ్యాము...

(తిరువూరు, ఆగస్టు 25, మేజర్ న్యూస్)

వివరాలు 2లో




# రాష్ట్రవ్యాప్తంగా పండుగ వాతావరణం

### స్మార్ట్ రైస్ కార్డులు ఎంతో ఉపయోగం : రాష్ట్ర పౌరసరఫరాలు శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్



**పెనమలూరు మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో చౌక దుకాణాల ద్వారా పారదర్శకంగా నిత్యావసర సరుకులు పొందుట కోసం స్మార్ట్ రైస్ కార్డులు ఎంతగానో ఉపయోగపడతాయని రాష్ట్ర పౌరసరఫరాలు శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. సోమవారం మధ్యాహ్నం రాష్ట్ర మంత్రి రాష్ట్ర పౌరసరఫరాల కమిషనర్ సౌరబ్ గౌర్, సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మలతో కలసి పెనమలూరు నియోజకవర్గం లోని పోరంకి బిజేఆర్ నగర్ లో లబ్ధిదారుల ఇంటింటికి తిరిగి వారికి స్మార్ట్ రైస్ కార్డులను పంపిణీ చేశారు. అనంతరం మంత్రి పోరంకి డీలర్ సిహెచ్ దుర్గారాణి చౌక దుకాణాన్ని తనిఖీ చేసి అందులో ఉన్న స్టాకు వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ ఈ రోజు రాష్ట్రవ్యాప్తంగా పండుగ

మిగతా 2లో

# ఒక్క క్లిక్.. వేయి భావాల లాజిక్

- ఛాయాచిత్రం.. మధురానుభూతులకు సజీవ సాక్ష్యం
- పాత్రికేయరంగంలో ఫోటో జర్నలిస్టుల పాత్ర కీలకం
- ఫోటోలు లేని వార్తా పత్రిక వెలుగు లేని దివిటీ వంటిది
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, విశ్రాంత ఐఏఎస్ అధికారి డి. చక్రపాణి

వివరాలు 2లో






### పిఎసిఎస్‌లలో యూరియా నిల్...

# ప్రైవేటు దుకాణాలలో ఫుల్

- అధికారుల అండతో రెచ్చిపోతున్న ఎరువుల దుకాణ యజమానులు
- ప్రైవేటు దుకాణాలలో యూరియా బస్తా 500 రూపాయలు
- రైతులకు అవసరంలేని ఇతర ఎరువులు కొంటేనే యూరియా...
- అదేమని అడిగిన వారిపై అధికారులు, దుకాణ యజమానుల బెదిరింపులు

2లో



## పి ఫోర్ మార్గదర్శిలను గుర్తించాలి

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** పి ఫోర్ మార్గదర్శకాలను విధిగా పాటిస్తూ మార్గదర్శిలను గుర్తించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ నగరంలోని వారి చాంబర్లో సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మతో కలిసి పి – ఫోర్ కార్యక్రమం పురోగతిపై సంబంధిత నియోజకవర్గాల ప్రత్యేక అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పి ఫోర్ కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. జిల్లాలో పేద కుటుంబాలకు చేయూతనందించి వారినీ పైకి తీసుకుని రావాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం అన్నారు.జిల్లాలో ప్రస్తుతం 53,759 పేద కుటుంబాలను బంగారు కుటుంబాలుగా గుర్తించామని, అందులో 48,549 బంగారు కుటుంబాలను 4,294 మార్గదర్శి లకు దత్తత తీసుకునేలా అనుసంధానం చేశామన్నారు.జిల్లాలో ఇంకా మార్గదర్శిలను గుర్తించి పి ఫోర్ కార్యక్రమంలో భాగస్వాములు చేయాలని, ఇందులో ఏమాత్రం ఒత్తిడి చేయరాదని వారు స్వచ్ఛందంగా చేరేలా ప్రోత్సహించాలన్నారు. ఈ సమావేశంలో సిపిఓ భీమరాజు, డ్వామా, మెప్మా పిడీలు శివప్రసాద్, సాయిబాబు, పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు చిన్న నరసింహులు, మార్కెటింగ్ ఎడి నిత్యానందం, మార్క్ఫెడ్ జిల్లా మేనేజరు మురళీ కిషోర్ కొత్తగా నియమితులైన యువ వృత్తి నిపుణులు పాల్గొన్నారు.

## ఈవీఎం గొడౌన్ తనిఖీ చేసిన కలెక్టర్ డీ కే బాలాజీ



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** కలెక్టరేట్ ప్రాంగణంలోని ఈవీఎం గొడౌన్ ను నెలవారి తనిఖీల్లో భాగంగా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తనిఖీ చేశారు. తొలుత గొడౌన్ సీళ్లను పరిశీలించారు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రత సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. అనంతరం సంబంధిత రికార్డులు పరిశీలించి రికార్డ్లో సంతకం చేశారు. కలెక్టర్ వెంట శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

## కర్రీ మహేష్ పై సస్పెన్స్ వేటు వేసిన బండి రామకృష్ణ




**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** కర్రి మహేశ్పై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో మచిలీపట్నం జనసేన పార్టీ ఇంచార్జ్ బండి రామకృష్ణక్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు. ఇటువంటి సంఘటనలు జరగటం దురదృష్టకరమని విచారం వ్యక్తం చేశారు. కర్రి మహేష్ పై వచ్చిన ఆరోపణల పై జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వం రద్దు,పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంచడం జరిగిందని రామకృష్ణ తెలిపారు.రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకుకర్రి మహేష్ సభ్యత్వాన్ని రద్దుచేసి పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంచుతామని నిజనిర్ధారణ తరువాత పోలీసు వారిచ్చిన వివరాలను రాష్ట్ర పార్టీకి అందజేసి రాష్ట్ర పార్టీ నిర్ణయం మేరకు పార్టీ సభ్యత్వం పై పునరాలోచన చేస్తామని అన్నారు. బండి రామకృష్ణ మాట్లాడుతూ జనసేన పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరు నడుచుకోవాలని ఎంత పెద్ద నాయకులైనా తప్పు చేస్తే రాష్ట్ర అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఉపేక్షించరని తెలిపారు. జనసేన పార్టీలో నిజనిర్ధారణ జరిగే వరకూ సభ్యత్వాన్ని రద్దుచేసి సస్పెన్షన్ వేటు ప్రక్రియ నాలాంటివారికైనా తప్పదన్నారు జనసేన పార్టీ శ్రేణులు ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకొని ఏదైనా సమస్యలు ఉంటే పార్టీ పెద్దలకు తెలియజేయాలన్నారు. గడ్డం రాజు, గల్లా తీమోతి, తోట రాజేష్, జెనసేన నాయకులు పాల్గొన్నారు.

## స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ



**ఏ.కొండూరు, మేజర్ న్యూస్:** మండలంలోని చీమలపాడు గ్రామంలో సోమవారం రేషన్ షాప్ వద్దస్మార్ట్ రేషన్ కార్డులు లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు కొండేపాటి సుబ్బారావు, గ్రామ పార్టీ సెక్రెటరీజంగా స్టాలిన్, పిఏసిఎస్ అధ్యక్షులుబెజవాడ శంకర్, ఏఎంసి మార్కెట్ డైరెక్టర్ షేక్ కరీముల్లా, ముస్లిం మైనారిటీ మండల అధ్యక్షుడుషేక్ ఆదం షరీఫ్, బూత్ కన్వీనర్ సింహాద్రి సత్యనారాయణ, డీలర్లు, వీఆర్వో జడ్పీటీసీ భూక్యగనియా, కోలా నరసింహారావు, పలువురు పాల్గొన్నారు.

# మీకోసం అర్జీల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

### జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మీకోసం అర్జీల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి అర్జీదారులకు నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం ఆయన కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ సమావేశపు మందిరంలో సహాయ కలెక్టర్ ఫర్హీన్ జాహిద్, డీఆర్వో కే చంద్రశేఖరరావు, కే ఆర్ ఆర్ సీ డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, డీఎస్పీ జి శ్రీనివాసరావు, బందరు ఆర్డిఓ కే స్వాతితో కలసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం కార్యక్రమం నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి అందిన అర్జీల పట్ల నిర్లక్ష్యం వహించకుండా నిర్ణీత సమయానికి పరిష్కరించాలని అధికారులకు సూచించారు. మండల స్థాయిలో నిర్వహించే మీకోసం కార్యక్రమంలో అధికారులందరూ పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. వివిధ శాఖల్లో పెండింగ్ కోర్టు కేసుల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచిస్తూ, అవసరమైన వాటికి సకాలంలో కౌంటర్ దాఖలు చేయాలని చెప్పారు. అదేవిధంగా వివిధ శాఖలకు సంబంధించిన డాక్యుమెంట్లను సంబంధిత ఆన్లైన్ పోర్టల్ లో అప్లోడ్ చేయడంలో కొన్ని శాఖలు వెనుకబడి ఉన్నాయని వాటిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు.స్వచ్ఛఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఉత్తమ పనితీరు కనబరిచిన అధికారులకు అక్టోబర్ రెండవ తేదీన రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛ ఆంధ్ర అవార్డులు అందిస్తుందని, ఈ నేపథ్యంలో జిల్లా అధికారులు పేర్లను ప్రతిపాదించాలని సూచించారు.ఇదే క్రమంలో స్వచ్ఛ పాఠశాలలు, అంగన్వాడీలు, ఆసుపత్రులు, బస్టాండ్లు, రైతు బజార్లు, వసతి గృహాలు, పరిశ్రమలు వంటి వాటికి మార్కులు కేటాయించి అవార్డులు ఇవ్వడం జరుగుతుందని, వాటిని కూడా ప్రతిపాదించాలని అధికారులకు సూచించారు. దీనికి జిల్లా పరిషత్ సీఈఓ కన్నమనాయుడు నోడల్ అధికారిగా వ్యవహరిస్తారని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ శర్మిష్ఠ, ఆర్ అండ్ బి ఈఈ లోకేష్, ఆర్డబ్ల్యూఎస్ అధికారి నటరాజ్, సిపిఓ భీమరాజు, జిల్లా వ్యవసాయ అధికారి మనోహర్రావు, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ టి శివరాం ప్రసాద్, ఐసిడిఎస్ పిడి ఎంఎన్ రాణి తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# యూరియా సక్రమంగా రైతులకు పంపిణీ చేయాలి

### ఎట్టి పరిస్థితుల్లోనూ పక్కదారి పట్టకూడదు...

### జిల్లా సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మ



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** యూరియా సక్రమంగా రైతులకు పంపిణీ చేయాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ పక్కదారి పట్టకూడదని జిల్లా సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మ ఎరువుల డీలర్లను ఆదేశించారు. సోమవారం మధ్యాహ్నం సంయుక్త కలెక్టర్ ఉయ్యూరు ఆర్డిఓ బిఎస్ హేలా షారోన్, గన్నవరం డిఎస్పి సి హెచ్ శ్రీనివాసరావుతో కలిసి సంయుక్తంగా పెనమలూరులోని రైతు మిత్ర ఆగ్రో ట్రేడర్స్, పెనమలూరు ఫర్టిలైజర్స్ అనే రెండు ఎరువుల దుకాణాలను, గోదాములను ఆకస్మిక తనిఖీ చేశారు.ఈ సందర్భంగా సంయుక్త కలెక్టర్ ఎరువుల దుకాణంలోని యూరియా తదితర ఎరువుల పంపిణీ రికార్డులను, గోదాముల్లో స్టాకు స్థితిగతులను పరిశీలించి వివరాలను సంబంధిత డీలర్ల ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంయుక్త కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు కావలసినంత యూరియాను సరఫరా చేస్తుందని, యూరియా కొరతను కృత్రిమంగా సృష్టించవద్దని సంయుక్త కలెక్టర్ డీలర్లకు సూచించారు. యూరియాను అధిక ధరలకు విక్రయించిన, పక్కదారి పట్టించిన చట్టరీత్యా క్రిమినల్ చర్యలు చేపడతామని హెచ్చరించారు. యూరియాకు మరో ఎరువు జత చేసి అమ్మరాదని స్పష్టం చేశారు. నానో ఎరువుల వాడకాన్ని రైతులకు తెలియజేసి ప్రోత్సహించాల న్నారు. ఈ తనిఖీలో సంయుక్త కలెక్టర్ గన్నవరం వ్యవసాయ సహాయ సంచా లకులు సునీల్, మండల వ్యవసాయ అధికారి శైలజ, తహసీల్దార్ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపంపిణీ వ్యవస్థలో పారదర్శకతకు పెద్దపీట

### స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీతో అక్రమాలకు చెక్

### మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్

### ఇబ్రహీంపట్నంలో స్మార్ట్ కార్డుల పంపిణీ



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** ప్రజా పంపిణీ వ్యవస్థలో అక్రమాలను తావులేకుండా పారదర్శకతకు పెద్దపీట వేస్తూ, పేదలకు అన్ని అవసరాలకు ఉపయోగపడే విధంగా రైస్కార్డుల స్థానంలో క్యూఆర్ కోడ్ ఉండే స్మార్ట్ కార్డులను పంపిణీ చేస్తున్నట్లు మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నంలోని ఫెర్రీ రోడ్డులో పాత పంచాయతీ కార్యాలయం వద్ద స్మార్ట్ రేషన్ కార్డులను ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అత్యంత పగడ్బందీగా స్మార్ట్ రేషన్ కార్డులను రూపొందించిందన్నారు. ఎన్టీఆర్ జిల్లాలో 5,87,135 స్మార్ట్ రేషన్ కార్డులు ఇస్తున్నట్టు తెలిపారు. కొండపల్లి మున్సిపాలిటీ, ఇబ్రహీంపట్నం మండల పరిధిలో 15,300 స్మార్ట్ కార్డులను పంపిణీ చేసున్నట్లు వెల్లడించారు.వీటిని ఈ నెల 29 వరకు వృద్ధులు, దివ్యాంగులకు కార్డులను పంపిణీ చేస్తారని, సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి సాధారణ కార్డుదారులకు రేషన్ షాపుల వద్ద అందజేస్తారని వివరించారు. కార్డుదారులు బయో మెట్రిక్, ఓటిపి ద్వారా కార్డు పొందవచ్చని చెప్పారు.ఇప్పటి వరకు ఉన్న రైస్ కార్డుల్లో ఆ కుటుంబానికి చెందిన సభ్యులందరితో ఫొటో ఉండేది. ఇప్పుడు ఆ స్థానంలో కుటుంబ యజమాని ఫొటో ఉంటుంది. ఇతర సభ్యుల పేర్లు మాత్రమే నమోదు చేస్తారు.గతంలో రైస్ కార్డులపై ఎవరు అధికారంలో ఉంటే ఆ సీఎం ఫొటోలు కార్డులపై ఉండేవి. ఇప్పుడు ఈ స్మార్ట్ కార్డుల్లో ప్రభుత్వ చిహ్నం మాత్రమే ఉంటుంది. ప్రస్తుతం ఇవ్వనున్న స్మార్ట్ కార్డులు బ్యాంకు డెబిట్ కార్డు (ఏటీఎం)ల తరహాలో ఉండనున్నాయి. పారదర్శకతతో రేషన్ సరుకులు పంపిణీ చేసేందుకు వీలుగా క్యూఆర్ కోడ్ ద్వారా డైనమిక్ కీ రిజిస్టర్తో వీటిని అనుసంధానం చేస్తారు. తద్వారా రేషన్ పంపిణీలో అక్రమాలను అరికట్టవచ్చు. వీటిని ఐడెంటిటీ కార్డుల కింద కూడా వినియోగించుకోవచ్చు. స్మార్ట్ ఈ–పోస్ మిషన్లను కూడా ప్రభుత్వం అందుబాటులోకి తేనుంది. ఇప్పుడిస్తున్న స్మార్ట్ కార్డులను ఈ యంత్రం ద్వారా స్వైప్ చేస్తే కార్డుదారుడి వివరాలు వస్తాయి. వెరసి గతంలో యంత్రాలతో వచ్చిన సర్వర్ సమస్యలు ఉండవు. సిమ్, వైఫై, హాట్స్పాట్, బ్లూటూత్, టచ్ స్క్రీన్ వంటి ఆధునిక సదుపాయాలతో, ఆండ్రాయిడ్ సాంకేతికతతో పని చేస్తుంది. వేలిముద్ర పడకున్నా యంత్రంలో కెమెరా ద్వారా ఐరిస్ స్కాన్ చేయవచ్చు. తాజా పరిణామాలతో రేషన్ పంపిణీ వ్యవస్థ నూతన సాంకేతిక మార్పులతో అత్యంత పకడ్బందీగా మారనుందని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు.

# స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభించిన ఎమ్మెల్యే రాజా



**పామర్రు ఆగస్టు 25 మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం వినూత్నంగా ప్రవేశపెట్టిన క్యూఆర్ కోడ్ ఆధారిత స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. సోమవారం పామర్రు లో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కుమార్ రాజా పాల్గొని లబ్ధిదారులకు వీటిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పేదలకు అందాల్సిన రేషన్ లో అక్రమాలు జరగకుండా ఉండేందుకు స్మార్ట్ కార్డు విధానాన్ని తీసుకువచ్చిందన్నారు. ఈ విధానం ద్వారా రేషన్ కార్డుదారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో సక్రమంగా రేషన్ పంపిణీ చేసేందుకు అవకాశం కలుగుతుందన్నారు. రేషన్ కార్డు పై ఉన్న క్యూఆర్ కోడ్ ను స్కాన్ చేయడం ద్వారా లబ్ధిదారుల ఫోటో లేదా వేలిముద్ర లేదా ఓటీపీ నెంబర్ ద్వారా రేషన్ పంపిణీ చేయడానికి అవకాశం కలుగుతుందన్నారు. తద్వారా ఎటువంటి అవకతవకలకు అవకాశం కలగకుండా లబ్ధిదారులకు నేరుగా సరుకు అందుతుందని తెలిపారు.

ప్రతి ఒక్క రేషన్ కార్డుదారునికి నూతనంగా ఈ స్మార్ట్ కార్డును గ్రామ రెవెన్యూ అధికారి ద్వారా అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారన్నారు. గ్రామ రెవెన్యూ అధికారులు ఇంటింటికి వచ్చి రేషన్ కార్డుదారులకు వీటిని అందిస్తారని ఆయన తెలిపారు. కాగి మండలంలో 34 చౌక ధరల దుకాణాలు ఉండగా వీటి పరిధిలో 16,439 రేషన్ కార్డులు ఉన్నాయని, వీరందరికీ ఈ స్మార్ట్ కార్డులను అందించడం జరుగుతుందని ఈ సందర్భంగా తహసీల్దార్ జి.రవికాంత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణా డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ వల్లూరుపల్లి గణేష్, జనసేన పార్టీ పామర్రు నియోజకవర్గ ఇన్చార్జ్ తాడిశెట్టి నరేష్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఎ.రాము, పిడిఎస్ డిప్యూటీ తహసీల్దార్ రంగారావు, మండల పరిధిలోని వీఆర్వోలు, రేషన్ దుకాణాల డీలర్లు, తెలుగుదేశం పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సహకార వ్యవస్థ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి



**కోడూరు మేజర్ న్యూస్ :** కూటమి ప్రభుత్వం సహకార వ్యవస్థ అభివృద్ధికి కృషి చేస్తోందని నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ అన్నారు. సోమవారం కోడూరు మండలం పీఏసీఎస్ కార్యాలయంలో సొసైటీ నూతన త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకార సభ జరిగింది. కోడూరులో నూతన పీఏసీఎస్ అధ్యక్షులుగా పూతబోయిన కరుణ కుమార్, సభ్యులుగా మల్ల వెంకటేశ్వరరావు, పూతబోయిన శ్రీనివాసరావు ప్రమాణ స్వీకారం చేశారు. కోడూరు మండల పరిధిలోని సాలింపాలెం పిఏసిఎస్ నూతన అధ్యక్షులుగా కొప్పనాతి సత్యనారాయణ, సభ్యులుగా మెండు బ్రహ్మయ్య, కొక్కిలిగడ్డ వరప్రసాద్, ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా వెంకట్రామ్ ఆయా సభల్లో మాట్లాడుతూ స్వాతంత్ర్యం అనంతరం దేశ చరిత్రలో మొట్టమొదటిసారి రైతులకు 24 గంటల్లో ధాన్యం సొమ్ము చెల్లించిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కిందన్నారు. వైసీపీ పాలనలో ఆఫ్ లైన్, ఆన్లైన్ పేరుతో సకాలంలో ధాన్యం కొనక, డబ్బులు రాక రైతులు నానా బాధలు పడ్డారన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీకి అనుగుణంగా అన్నదాత సుఖీభవ పథకం సమర్ధవంతంగా నిర్వహిస్తున్నామన్నారు.

## దివ్యాంగురాలికి ఎలక్ట్రికల్ ట్రై సైకిల్ అందించిన ఎమ్మెల్యే

**పెదపారుపూడి ఆగస్టు 25 మేజర్ న్యూస్:** మండల పరిధిలోని చినపారుపూడి గ్రామానికి చెందిన కోపూరి మరియమ్మ అనే వికలాంగ మహిళకు పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా చేతుల మీదుగా దివ్యాంగుల బ్యాటరీ ఛార్జింగ్ ట్రై సైకిల్ ను అందజేశారు. సోమవారం చినపారుపూడి గ్రామానికి విచ్చేసిన ఆయన మరియమ్మకు ట్రైసైకిల్ ను అందించారు. ఎంతోకాలంగా తాను ఇబ్బంది పడుతున్నానని, తన ఇబ్బందులను గుర్తించిన ఎమ్మెల్యే కుమార్ రాజా తనకు ట్రైసైకిల్ అందించడం పట్ల మరియమ్మ హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కుమార్ రాజాతో, పార్టీకి చెందిన పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసిన సర్పంచ్



**కంచికచర్ల ఆగస్టు 25 మేజర్ న్యూస్ :** ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరు సక్రమంగా సద్వినియోగపరుచుకోవాలని పేరకలపాడు సర్పంచ్ మన్నే సాత్విక స్పష్టం చేశారు సోమవారం పేరకలపాడు గ్రామంలో కూటమి ప్రభుత్వం నూతనంగా అందిస్తున్న స్మార్ట్ రేషన్ కార్డులను లబ్దిదారులకు ఆమె అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియగా ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు.స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రభుత్వం రాజముద్ర, కుటుంబసభ్యుల వివరాలు, క్యూఆర్కోడ్ ఉంటాయని సర్పంచ్ సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్తో పాటు, గ్రామ నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎరువుల దుకాణాలను తనిఖీ చేసిన తహసీల్దార్



**పమిడిముక్కల ఆగస్టు 25 మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని ఎరువుల దుకాణాలలో స్థానిక వ్యవసాయ అధికారితో కలిసి తహసీల్దార్ సిహెచ్.నవీన్ కుమార్ సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన దుకాణాలలో ఉన్న యూరియా ఇతర ఎరువుల నిల్వలు, రికార్డుల నిర్వహణ వంటి అంశాలను పరిశీలించి ప్రభుత్వం నిర్దేశించిన ధరల కంటే అధిక ధరలకు ఎరువులను విక్రయించరాదని సూచించారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే దుకాణాలను సీజ్ చేస్తామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. రైతులను ఇబ్బందులు పెట్టకుండా యూరియా సక్రమంగా అందించాలని దుకాణ యజమానులకు తహసీల్దార్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ తో పాటు మండల వ్యవసాయ అధికారి గణేష్ రెడ్డి, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# అవనిగడ్డ సబ్ జోన్ ఆటల పోటీలు ప్రారంభించిన ఎమ్మెల్యే మండలి



**కోడూరు మేజర్ న్యూస్ :** అవనిగడ్డ నియోజకవర్గం వ్యాయామ ఉపాధ్యాయుల కార్ఖానా అని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. సోమవారం జాతీయ క్రీడా దినోత్సవం, భారతదేశ హాకీ మాంత్రికుడు స్వర్గీయ మేజర్ ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా కోడూరు మండలం వీ.కొత్తపాలెం జడ్పీ హైస్కూల్లో అవనిగడ్డ సబ్ జోన్ వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి ఆటలు, క్రీడల పోటీలు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ముఖ్య అతిధిగా విచ్చేసి జాతీయ జెండా ఎగురవేసి పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వీ.కొత్తపాలెంలో సబ్ జోన్ ఆటల పోటీల నిర్వహణకు గ్రామస్థులు, యువత ప్రోత్సాహం అందించటం శుభపరిణామం అన్నారు. అభివృద్ధిని కాంక్షించే పెద్దలు, చైతన్యవంతులైన యువత సమిష్టి కృషితోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం అన్నారు. క్రీడల్లో రాణించి ఉన్నత ఉద్యోగాలు సాధించిన ఈ పాఠశాల పూర్వ విద్యార్థుల స్ఫూర్తితో విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోను రాణించాలని పిలుపునిచ్చారు. గ్రామ పెద్దలు రేపల్లె రాజయ్య మాట్లాడుతూ స్వర్గీయ మండలి వెంకట కృష్ణారావు పార్లమెంట్ సభ్యులుగా ఉన్న సమయంలో 1962లో ఈ పాఠశాల స్థాపిస్తే, అదే సంవత్సరం ఈ హైస్కూల్ క్రీడాకారులు కబడ్డీలో జిల్లా షీల్డ్ సాధించారని తెలిపారు. ఎంఈఓ టీవీఎం రాందాస్ మాట్లాడుతూ సుమంత్ ఎంటర్ ప్రైజెస్ ఎండీ కేవీబీ రామమోహనరావు ఈ పాఠశాలలో క్రీడాభివృద్ధికి రూ.50వేలు, పోటీల నిర్వహణకు రూ.50వేలు ఆర్థిక సహాయం అందచేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా దాత తండ్రి కోసూరు బాబూరావును, వ్యాయామ ఉపాధ్యాయు లకు, క్రీడాకా రులకు స్పోర్ట్స్ యూనిఫామ్స్ సమకూర్చిన దాతలను ఎమ్మెల్యే చేతులమీదుగా ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ కబడ్డీ కోర్టు ప్రారంభించి, క్రీడాకారులను అభినందించారు. పోటీలకు నియోజకవర్గ వ్యాప్తంగా క్రీడాకారులు ఉత్సాహంగా తరలివచ్చారు.

## గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న వ్యక్తికి అండగా గోపు సత్యనారాయణ



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** గుండె సంబంధిత వ్యాధితో దీర్ఘ కాలంగా బాధపడుతున్న కానూరు గ్రామానికి చెందిన పెదశింగు నాగార్జునకు అండగా నిలిచిన కృష్ణాజిల్లా తెలుగు రైతు అధ్యక్షులు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గోపు సత్యనారాయణ.కానూరు గ్రామానికి చెందిన దీర్ఘకాలికంగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న పెదశింగు నాగార్జున ఆర్థికంగా వెనకబడినందున్న వారికి అండగా మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గోపు సత్యనారాయణ నిలుస్తూ ఈ చికిత్సకు అయ్యే మొత్తం 19 లక్షల 20వేల నగదును రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర ద్వారా ముఖ్యమంత్రి సహాయ నిధికి అర్జీ పెట్టించడం జరిగినది. ఈ అర్జీని పరిశీలించి పరిష్కరిస్తారని వారు ఆశాభవం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పీతా రాము,మోపిదేవి కృష్ణ, బొమ్మిడి ఏడుకొండలు, పెదసింగు సుబ్రమణ్యం, పెదసింగు నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## జి.కొండూరులో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** జి కొండూరు గ్రామంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కూటమి ప్రభుత్వ ఆదేశాల మేరకు స్థానిక శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాద్ సూచనలతో ఎన్టీఆర్ జిల్లా మైలవరం నియోజకవర్గం జి.కొండూరు మండలం కేంద్రలో ఈ రోజు ఉదయం స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పజ్జూరు రవికుమార్, గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పజ్జూరు వెంకటేశ్వరావు(బుల్లి), మాజీ ఏఎంసి చేర్మెన్ ఉయ్యూరు నరసింహారావు, మైలవరం నియోజకవర్గం తెలుగు రైతు ప్రధానకార్యదర్శి అంకెం సురేష్, మైలవరం బీసీ సెల్ అధ్యక్షులు పటా పంచులు నరసింహారావు, నక్కనబోయన తిరుపతిరావు,రేషన్ డీలర్ షాప్ 1.2,.నక్కనబోయన తిరుపతిరావు, షాప్ 3.గొడవర్తి విజేయ్ కుమార్, ఎమ్మార్వో చాట్ల వెంకటేశ్వరావు, డిటి, వీఆర్వో లు సచివాలయ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మట్టి గణపతనే పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుకుందాం..



**జగ్గయ్యపేట, ఆగస్టు 25, మేజర్ న్యూస్ :** శ్రీ వాసవి సేవా సమితి ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట, జగ్గయ్యపేట మండల ఆర్యవైశ్య సంఘం సంయుక్త ఆధ్వర్యంలో మట్టి వినాయకల పంపిణీ కార్యక్రమం ఈ కార్యక్రమనకు దాతలు స్వామి బుధజనపాల్, బండారు రవి కుమార్, పేరూరి నరసింహారావు, అత్తులూరి విశ్వనద్ల సౌజన్యంతో, ముఖ్య అతిథిగా శాసన సభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీరాం సుబ్బారావు చేతుల మీదుగా పంపిణి జరుగును. స్థలం మసీదు దగ్గర మంహాకాళి కోటేశ్వరరావు పెరూరి నరసింహారావు షాపు వద్ద పంపిణీ జరుగును. ఉదయం 6.30 ప్రారంభం అవుతుంది. ఈ కార్యక్రమంలో శ్రీ వాసవి సేవా సమితి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కాకరపర్తి సోమేశ్వరరావు, ఎన్టీఆర్ జిల్లా గౌరవ అధ్యక్షుడు పేరూరి నరసింహారావు, జిల్లా కార్యదర్శి పెనుగొండ రామకృష్ణ,జిల్లా కోశాధికారి కంభం పాటి రవి కుమార్,మండల సంఘం అధ్యక్షుడు బండారు రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కుంటముక్కలలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** జి.కొండూరు మండలం కుంట మొక్కల గ్రామంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కూటమి ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డులను శాసనసభ్యులు వసంత కృష్ణ ప్రసాద్ సూచన మేరకు ప్రభుత్వం నూతనంగా జారీ చేసిన స్మార్ట్ రేషన్ కార్డులను గ్రామంలోని నాయకులు పాల్గొని కార్డు యజమానులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి లంక రామకృష్ణ వరప్రసాద్, సుఖవాసి శ్రీహరి,సర్పంచ్ వంగూరి కుమారి కెనడి,ఎంపిటిసి సందీపా ము జయలక్ష్మి, లింగాల జోజి,డీలర్ జమలయ్య సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా దేవస్థానం కమిటీ ప్రమాణ స్వీకారం



**విసన్నపేట మేజర్ న్యూస్ :** గంగా పార్వతీ సమేత చంద్రశేఖర స్వామి వారి దేవస్థానం కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవం సోమవారం శివాలయ ప్రాంగణంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. నియోజకవర్గ శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం మహోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు, కూటమి భాగస్వామ్య పార్టీలైన జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా భారతీయ జనతా పార్టీ ఉపాధ్యక్షురాలు పోలే శాంతి మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ తరపున కొత్తూరు ప్రసన్నకు శివాలయం కమిటీలో భాగస్వామ్యం కల్పించినందుకు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్ రావు, విజయవాడ పార్లమెంటు సభ్యులు కేసినేని శివనాథ్ కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు గంగిశెట్టి మధు, మాజీ మండల అధ్యక్షురాలు తోకల సుమ, తిరువూరు ఏఎంసీ డైరెక్టర్ అబ్బినేని చంద్రశేఖర్ కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్ల వెంకట శ్రీనివాసరావు, ఎస్సీ మోర్చ నాయకులు శంకర్, పులపాక బాబు, లాం కొండలరావు, తదితరులు పాల్గొన్నారు.

## గుడ్లవల్లేరు సంపద తయారీ కేంద్రం పరిశీలన



**గుడ్లవల్లేరు ఆగస్టు 25 మేజర్ న్యూస్ :** గుడ్లవల్లేరు గ్రామపంచాయతీలో గల చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని జి సుధీర్, రీసెర్చ్ ఇన్వెస్టిగేటర్, ఎస్ బి ఎం, కృష్ణా జిల్లా సందర్శించారు. సందర్శనలో భాగంగా షెడ్డులో గల ప్లాస్టిక్ షెడ్డర్ పనితీరు పరిశీలించారు. గ్రామంలో గల ప్లాస్టిక్ గ్లాసులను, బాటిల్స్‌ను ఈ మిషన్ ద్వారా చిన్న చిన్న ముక్కలుగా చేయవచ్చు. గ్రామంలో తడి చెత్త పొడి చెత్త సేకరణ విధానాన్ని హరిత రాయబారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ప్రతి ఇంటి వద్ద తడి పొడి చెత్త విడివిడిగా సేకరించి అక్కడే వేరు చేయవలసిందిగా సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి ఎజెఎల్ నరసింహారావు, పంచాయతీ సిబ్బంది నాగరాజు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## మండలంలో జిల్లా గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పర్యటన



**విసన్నపేట మేజర్ న్యూస్ :** జిల్లా గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు సోమవారం మండలంలో పర్యటించారు. అనంతరం విసన్నపేట సత్తుపల్లి రోడ్డు లోని కెఎంఆర్ ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో విస్సన్నపేట, రెడ్డిగూడెం మండలాల గణపతి ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం అయ్యారు. ప్రతి గ్రామం నుంచి విగ్రహ కమిటీ సభ్యులతో సమన్వయం కొరకు, మంటపాల పర్యవేక్షణ కొరకు ఔత్సాహికులైన సభ్యులతో కన్వీనర్లను కమిటీలను వేశారు. ఈ కార్యక్రమానికి ఎన్టీఆర్ జిల్లా గణపతి ఉత్సవ కమిటీ సభ్యులు, ఎన్టీఆర్ జిల్లా గణపతి ఉత్సవ కమిటీ ఉపాధ్యక్షులు సంజయ్ మెహతా, సంజయ్ గోయల్, జిల్లా సహ కార్యదర్శి పైలా సురేష్, ప్రచార కార్యదర్శి ముదిగొండ శివ పాల్గొని ఉత్సవ కమిటీ సభ్యులకు దిశానిర్దేశం చేశారు.

## రేషన్ అక్రమాలు నిరోధించేందుకు స్మార్ట్ రేషన్ కార్డులు



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** గుడ్లవల్లేరు గ్రామంలోని చౌకధరల దుకాణం వద్ద స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం సోమవారం జరిగింది. గుడ్లవల్లేరు విఆర్వో శాయన ప్రకాష్ ఆధ్వర్యంలో ఎఎంసి ఛైర్మన్ పొట్లూరి రవికుమార్, పిఏసిఎస్ ఛైర్మన్ యెనిగళ్ళ నాగేశ్వరరావు, గ్రామ పార్టీ అధ్యక్షులు వల్లభనేని రంగబాబు, టీడీపీ పెద్దలు జంగం మోహనరావు ల చేతుల మీదుగా లబ్దిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు అందచేసారు. ఈ సందర్భంగా ఎఎంసి ఛైర్మన్ పొట్లూరి రవికుమార్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తోందని, రేషన్ సరఫ రాలో అవినీతి, అక్రమాలు నియంత్రించేందుకు ప్రభుత్వం చేపట్టిన చర్యల్లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా నాలుగు దశల్లో క్యూఆర్ కోడ్‌తో కూడిన కోటి 45 లక్షల స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎజెఎల్ నరసింహారావు, పరంధామయ్య, డీలర్లు పాల్గొన్నారు.

# స్త్రీ శక్తి పథకం మహిళలకు ఒక వరం

### టీడీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ ఫైజాన్



**ఏ.కొండూరు, మేజర్ న్యూస్ :** స్త్రీ శక్తి పథకం మహిళలకు ఎంతో ఉపయోగపడుతుందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ ఫైజాన్ పేర్కొన్నారు. మండలంలోని చీమలపాడు గ్రామంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకంలో భాగంగా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేస్తూ వాటిలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించారన్నారు. తప్పుడు ఆరోపణలతో స్త్రీ శక్తి పథకంపై వైఎస్ఆర్సిపి నాయకులు ఈరోజు మళ్లీ ఫేక్ ప్రచారం చేస్తూ తప్పులు వెతకడం మొదలు పెట్టారన్నారు. ఎంతో బాధ్యతతో సూపర్ సిక్స్ లో భాగంగా ఇచ్చిన మాట ప్రకారం మహిళకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించి ఎక్కడి నుంచి ఎక్కడికైనా రాష్ట్రంలో ప్రయాణించే విధంగా ఏర్పాటు చేసినటువంటి వ్యక్తి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఆరోజు మేనిఫెస్టోలో భాగంగా ఒక జిల్లా నుండి మరో జిల్లా బోర్డర్ వరకు మాత్రమే అని మేనిఫెస్టోలో చెప్పిన మన ఆడబిడ్డలు ఇబ్బంది పడకూడదు అని రాష్ట్రంలో ఎక్కడ నుండి ఎక్కడికైనా ప్రయాణం చేయవచ్చు అని ఈ పథకం ప్రవేశపెట్టారన్నారు. ఇదంతా 2. కోట్ల 64 లక్షల మంది మహిళలకు ఉపయోగపడే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంత్రి నారా లోకేష్ పవన్ కళ్యాణ్ కలిసి స్త్రీశక్తి పథకాన్ని ప్రారంభించారన్నారు. సూపర్ సిక్స్ సూపర్ హిట్ అని మహిళలు అంటున్న చూసి ఓర్వలేక ఈ వైయస్సార్ సిపి నాయకులు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. లేనిపోని ఫేక్ వీడియోలు ఇతర రాష్ట్రంలో జరిగినటువంటి ఆర్టీసీ బస్సు ఘర్షణల్ని వీడియోల్ని పెట్టి ఫేక్ గా ప్రచారం చేస్తూ రాష్ట్ర లో స్త్రీశక్తి పథకం వల్ల ఎలాంటి ఉపయోగం లేదని మహిళలు ఇబ్బంది పడుతున్నారని గొడవ సృష్టించడం కోసం చేస్తున్న పనులు ఇప్పటికైనా మానుకోవాలని హితువు పలికారు. మీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఫేక్ పార్టీ ప్రతిదీ ఫేక్ న్యూస్ లు పెట్టి ప్రజల్ని ఇబ్బంది పెట్టాలని చూస్తే చూస్తూ ఊరుకోవటానికి ఈరోజు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు గాని నాయకులు ఎవరు కూడా సిద్ధంగా లేరన్నారు. ఇలాంటి తప్పుడు వీడియోలు సృష్టిస్తూ ప్రభుత్వంపై బురద చల్లే ప్రయత్నం చేసే వారిపై తగు చర్యలు తీసుకోవడానికి అయినా ప్రభుత్వం వెనకాడదన్నారు.

## రెడ్డిగూడెంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**రెడ్డిగూడెం, ఆగస్టు 25, మేజర్ న్యూస్ :** రెడ్డిగూడెం మండలంలో సోమవారం క్యూ ఆర్ కోడ్ ఆధారిత స్మార్ట్ రేషన్ కార్డులను తహసీల్దార్ సుశీల దేవి, మండల పార్టీ అధ్యక్షులు ముప్పిడి నాగేశ్వర రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు నూతన సాంకేతికత ద్వారా సౌకర్యవంతమైన, పారదర్శకమైన రేషన్ పంపిణీ అందించడమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు. స్మార్ట్ రేషన్ కార్డులు అమలులోకి రావడం వలన ఎలాంటి అవకతవకలు లేకుండా, ప్రతి అర్హత ఉన్న కుటుంబానికి సరైన సమయానికి సరుకులు అందుతాయి. గ్రామీణ ప్రజలకు ఇది ఒక పెద్ద ఉపశమనం. ఈ సాంకేతిక పరిజ్ఞానం వలన నిజమైన లబ్ధిదారుడే ప్రయోజనం పొందుతాడని అన్నారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ ఇన్స్పెక్టర్ గంధం పుల్లయ్య, రెడ్డిగూడెం పి ఏ సి ఎస్ అధ్యక్షులు ఉయ్యూరు సుబ్బారెడ్డి, జానలపాటి వేణుగోపాల రెడ్డి, వి ఎం సి డైరెక్టర్ మల్లాది పోతురాజు, ఉప సర్పంచ్ కొండపల్లి బాబు, వీఆర్వో బి. రమేష్, డీలర్ పి శ్రీనివాసరావు, రమేష్ రెడ్డి, రత్తా రెడ్డి, పోతురాజు బాలకృష్ణ, గ్రామ పార్టీ అధ్యక్షుడు చాట్ల చందా, ఎం విజయ్,, కూటమి నాయకులు పాల్గొన్నారు.



## వరి వంగడాలను క్షేత్రస్థాయిలో పరిశీలన

**ఘంటసాల, మేజర్ న్యూస్ :** ఆచార్య ఎన్ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రం, ఘంటశాల, కృష్ణా జిల్లా, కేవీకే శాస్త్రవేత్తల బృందం చిరుసంచుల దశలో ఉన్న వరి వంగడాలను (బి పి టి 3284, ఆర్ జి ఎల్ 7034, ఆర్ జి ఎల్ 7045) స్థానిక ఘంటసాల మండలంలోని చినకల్లేపల్లి, వేములపల్లి గ్రామాలలో క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ప్రస్తుతం సాగులో ఉన్న మారుటేరు రకాలు యంటియు 1318, యంటియు 1061, బాపట్ల రకాలతో చిరుసంచుల పనితీరును ముఖ్యంగా మొక్క యెక్క ఎత్తు, పిలకల సంఖ్య, పురుగు తెగులు తట్టుకునే శక్తి మొదలగు అంశాలను పోల్చి చూడడం జరిగింది. తదుపరి ప్రస్తుతం వరి దుబ్బు చేసే దశలో ఉందని, కాండం తొలుచు పురుగు, ఆకు ముడత పురుగు సమస్య గుర్తించడం జరిగిందని, నివారణకు ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా క్లోరాంట్రనిలిప్రోల్ 0.3 మి.లీ లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేసుకోవాలని కేవికే సమన్వయ కర్త డా. డి సుధా రాణి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో డా.యం.వెంకట లక్ష్మి, డా.కే.రేవతి రైతులు పాల్గొన్నారు.

# అన్నదాతల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కృషి

### ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

### ఘనంగా వెణుతురుమిల్లి పి.ఎ.సి.ఎస్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం

### నూతన కమిటీ సభ్యులను అభినందించిన ఎమ్మెల్యే రాము



**గుడ్లవల్లేరు ఆగస్టు 25 మేజర్ న్యూస్ :** వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా మార్చి అన్నదాతకు అన్ని విధాలా కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. గుడ్లవల్లేరు మండలం వెణుతురుమిల్లి గ్రామ పిఏసిఎస్ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం సోమవారం ఉదయం ఘనంగా జరిగింది. కమిటీ చైర్మన్‌గా కొప్పినేని పిచ్చిఈశ్వరరావు, డైరెక్టర్లుగా కట్టా శ్రీనివాసరావు, అల్లూరి బుజ్జి బాబు సోమవారం ఉదయం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే రాము శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ రాము మాట్లాడుతూ ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా రైతాంగ అభ్యున్నతికి కృషి చేయాలంటూ కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే రాము సూచించారు. రాష్ట్రంలో రైతాంగ సంక్షేమానికి సీఎం చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే రాము అన్నారు. అనంతరం ఎమ్మెల్యే రాము, కూటమి నాయకులు పిఏసిఎస్ కమిటీ చైర్మన్ ఈశ్వరరావు, ఇతర డైరెక్టర్లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, జనసేన పార్టీ ఇంచార్జి బూరగడ్డ శ్రీకాంత్, మండల టీడీపీ అధ్యక్షుడు కొసరాజు బాబయ్య చౌదరి, కూటమి నాయకులు సాయన పుష్పావతి, జంగం మోహన్ రావు వెంతురుమిల్లి సర్పంచ్ కొప్పినేని శేషవేణి, జగన్మోహన్రావు, తోట చిన్నారి, వెంకట్రావు, అట్లూరి దిలీప్, పొట్లూరి రవికుమార్, వెనిగళ్ళ నాగేశ్వరరావు, వీరమాచినేని శివప్రసాద్, వల్లపనేని రంగబాబు, పోలవరపు వెంకటరావు, బొప్పన్న శివప్రసాద్, బుర్ర ప్రశాంత్, కాగిత నరేంద్ర, మేక వెంకటేశ్వరరావు, రాజు, నవాబ్, తూము పద్మజ, తెల్లాకుల నాగలక్ష్మి, తోట రాధ, పెన్నేరు రమేష్, ఈడే మోహన్, ఏడుకొండలు, కొల్లి నాంజిబాబు, రామారావు, తోట మల్లి, దివ్య చౌదరి, అడపా బాబి, అబ్దుల్ సత్తార్, శివాజీ రెడ్డి, షేక్ జానీ, నరసింహారావు, కాగిత హరిబాబు, పాగోలు అనిల్ కుమార్, పోతుల గణేష్, చంద్ర వెంకటరాజు, పామర్తి అంకినీయుడు, దివిజోజి బాబు, రతీష్, చందన వెంకటరాజు, పామర్తి వెంకటేశ్వరరావు, పోతుల గణేష్, లక్ష్మణరావు, జోజి, ఫణి కుమార్, చందన శ్రీను, పలువురు రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## స్మార్ట్ రైస్ కార్డులు పంపిణీ

**తిరువూరు మేజర్ న్యూస్ :** మండలం పరిధిలోని ఆంజనేయపురం గ్రామంలో సోమవారం రైస్ కార్డుల స్థానంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్మార్ట్ రైస్ కార్డులను గ్రామ సర్పంచ్ మామిడి కుటుంబరావు, మామిడి శరత్, వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, రేషన్ డీలర్ రాధా గ్రామ ప్రజలకు పంపిణీ చేశారు, ఈ కార్యక్రమంలో మామిడి నరసింహారావు, షేక్ ఇమామ్, మామిడి కోటి, వేట కుటుంబరావు, వెంపాటి రాంబాబు, యాట రామకృష్ణ, బజ్జూరి శ్రీనివాసరావు, వాళ్లపనబోయిన వెంకటేశ్వరరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# దేవాలయాల అభివృద్ధికి కట్టుబడి ఉన్న కూటమి



**విజయవాడ, మేజర్ న్యూస్ :** యనమలకుదురు గ్రామం లోని శ్రీ కనకదుర్గ అమ్మవారి వారి దేవస్థానం మండపంలో... దేవస్థానం నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి మండలి రాజేష్ పాల్గొన్నారు. ముందుగా మండలి రాజేష్ కమిటీ సభ్యులు స్థానిక నాయకులతో కలిసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్గా కమ్మిలి నాగేశ్వరరావు. ఇతర సభ్యులచే దేవాదాయ శాఖ అధికారులు ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో భాగంగా జరిగిన సభలో మండలి రాజేష్ మాట్లాడుతూ కనకదుర్గ అమ్మవారి దేవాలయాల చైర్మన్ బాధ్యతలను జనసేన నాయకులు కమ్మిలి నాగేశ్వరావుకి కేటాయించినందుకు స్థానిక శాసనసభ్యులు బోడే ప్రసాద్కి కృతజ్ఞతలు తెలియజేశారు.. అలానే నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే బోడే ప్రసాద్ అహర్నిశలు కష్టపడుతున్నారని, గత కొద్ది రోజులుగా కురుస్తున్నటువంటి వర్షాలకు నియోజకవర్గ ప్రజలు పడుతున్న ఇబ్బందులను గమనించి జోరు వర్షాలను సైతం లెక్కచేయకుండా ఎమ్మెల్యే బోడె ప్రసాద్. దగ్గరుండి ప్రభుత్వ అధికారు లతో పని చేయించుకోవడం తాను ప్రత్యక్షంగా చూశానని ఈ సందర్భంగా రాజేష్ తన అనుభవాన్ని పంచుకున్నారు. అలానే ఆలయాల పటిష్టత కోసం ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తుందన్నారు.

భక్తుల మనోభావాలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం దేవాలయాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది అన్నారు. అనంత రం కమిటీ చైర్మన్ కమ్మిలి నాగేశ్వరరావు సభ్యులు చాంతాటి రాంబాబు, సుంకర విష్ణు భూపతి, బాణావత్ నాగమ్మ, వక్కలగడ్డ సామ్రాజ్యం, యారం శివ పార్వతి, రమని యువరాజ్, పుట్టమరాజు రమేష్ మారుతి కుమార్, కొడాలి కనకదుర్గ, సూరేపల్లి కోటేశ్వరరావును మండలి రాజేష్, కూటమి నాయకులు అభినందనలు తెలియజేస్తూ సత్కరించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు అమ్మవారి ప్రసాదాన్ని అందించినారు.. ఈ కార్యక్రమంలో తాడిగడప పట్టణ అధ్యక్షులు తాతిపూడి గణేష్, గుడివాడ నియోజకవర్గ జనసేన నాయకులు సందు పవన్

## రాష్ట్ర కార్యదర్శి మండలి రాజేష్
## ఘనంగా శ్రీ కనకదుర్గ అమ్మవారి దేవస్థానం కమిటీ ప్రమాణ స్వీకారం
## కమిటీ చైర్మన్ కమ్మిలి నాగేశ్వరరావుని, కమిటీ సభ్యులను అభినందించిన జనసేన రాష్ట్ర కార్యదర్శి మండలి రాజేష్

గన్నవరం నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు గరికపాటి శివశంకర్, కైకలూరు నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు నల్లగోపుల చలపతి, స్థానిక జనసేన నాయకులు.. తాడిగడప పట్టణ అధ్యక్షులు తాతిపూడి గణేష్, గుడివాడ నియోజకవర్గ జనసేన నాయకులు సందు పవన్ గన్నవరం నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు గరికపాటి శివశంకర్, కైకలూరు నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు నల్లగోపుల చలపతి, స్థానిక జనసేన నాయకులు.. కమ్మిలి వేణు, వడ్డీ జీవ 13 డివిజన్ అధ్యక్షులు, గంధం సురేష్ 21 డివిజన్ అధ్యక్షులు, పుల్పాక గ్రామ అధ్యక్షురాలు మేక స్వాతి, మేక సుబ్బారావు, యనమలకుదురు యువ నాయకులు రాజేష్ చనాపతి, మట్ట శ్యాం సాయి వెంకట్, చనాపతి సాయికుమార్, మాసిరెడ్డి మణికుమార్, సీతాల శ్రీనివాసరావు, అడకా నాని, తమ్మిశెట్టి విజయ్, కోనప రెడ్డి సతీష్, పెద్ది బాబి, తెలుగుదేశం పార్టీ నాయకులు.. అనంతునేని ఆజాద్, పాదాల ప్రభాకర్, నత్తల వంశీ, లంకా కృష్ణారావు, పత్తిపాటి వెంకటేష్, బిజెపి నాయకులు వెలగపూడి నాగభూషణం,, కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఉచిత మెగా సంచార వైద్య శిబిరానికి విశేష స్పందన

**జగ్గయ్యపేట, ఆగస్టు 25,మేజర్ న్యూస్:** "ఆరోగ్యమే మహాభాగ్యం" ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలి సమాజమంతా ఆనందంగా జీవించాలి. అనే ఉన్నత ఆశయంతో విలువలతో కూడిన వైద్య సేవలు అందిస్తున్న జయప్రద ఫౌండేషన్ చైర్మన్ తొండపు దశరథ జనార్ధన్ ఆధ్వర్యంలో జగ్గయ్యపేట పట్టణంలో విష్ణుప్రియ నగర్ శాంతినగర్ మధ్య బాక్స్ క్రికెట్ వద్ద ఏర్పాటుచేసిన ఉచిత సంచార మెగా వైద్య శిబిరంలో 402 మంది వైద్య సేవలు పొందినారు. జనరల్ వైద్య సేవలు పొందిన వారు 104 మంది. దంత వైద్య సేవలు పొందిన వారు 71 మంది. కంటి వైద్య సేవలు పొందిన వారు 229 మంది. అందులో కంటిలోపము నుండి కళ్ళజోడులు అవసరమైన వారు 168 మంది.ఆపరేషన్ల అవసరమైనవిగా గుర్తించబడిన వారు 47 మంది వారిలో శుక్లములు ఉన్నవారు 35 మంది. పొరలు ఉన్నవారు 12 మంది. అలాగే జనరల్ వైద్యంలో ఎక్సరేలు తీయబడినవి ఎనిమిది మందికి.ఈసీజీలు తీయబడినవి 33 మందికి, షుగర్, రక్త పరీక్షలు చేయబడినవి 402 మందికి. వీరిలో అవసరమైన వారందరికీ ఉచితంగా మందులు అందజేయబడినవి. ఈనాటి శిబిరంలో 31 వార్డు కౌన్సిలర్ గింజుపల్లి వెంకట్రావు, కృష్ణ, శిబిర కోఆర్డినేటర్ మైనేని రాధాకృష్ణ, మా లంపాటి ఆదినారాయణ, కాటా శ్రీనివాసరావు,గుత్తికొండ శ్రీనివాసరావు,బొజ్జ వెంకటనారాయణ, పోలవరపు



వెంకట కృష్ణ, కాట్ల భాస్కరరావు, చిగురుపాటి అశోక్ మనకలన పో నకాల అరుణ, కళ్యాణపు సూర్యప్రకాశరావు, నల్లమల రాధాకృష్ణ ఫౌండేషన్ కోఆర్డినేటర్ కట్టా వెంకట నరసింహారావు ఏఎన్ఎంలు ఆశా వర్కర్లు ఆర్పీలు పాల్గొని శిబిరానికి సహకారం అందించినారు. వారందరికీ కృతజ్ఞతలు తెలియజేయుచున్నాము. ఈ శిబిరం మరల 29 తేదీన శనివారం ఉదయం మార్కెటింగ్ యార్డ్లో నిర్వహించబడుతుందని జయప్రద ఫౌండేషన్ చైర్మన్ మాజీ ఎమ్మెల్సీ తొండపు దశరథ జనార్ధన్ తెలియజేశారు.

## నేత్రదానం పట్ల అవగాహన పెంపొందించుకోవాలి



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** నేత్రదానం పట్ల ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని ప్రధానంగా విద్యార్థులలో అవగాహన పెంపొందించడం ద్వారా సమాజంలోని అన్ని వర్గాల ప్రజలలో నేత్రదానం పట్ల విస్తృత ప్రచారం జరుగుతుందని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. సోమవారం స్థానిక ఎస్.వీ.ఎల్ క్రాంతి డిగ్రీ కళాశాలలో జాతీయ నేత్ర దాన పక్షోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. విజయవాడ ఎల్.వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి వారిచే సుదర్శి మానవతా సేవా సంస్థ, అవనిగడ్డ ప్రెస్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన నేత్రదాన అవగాహన సదస్సులో ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రధానంగా నేత్రదానం పట్ల సమాజంలో ఉన్న అపోహలు తొలగించాలని కోరారు. తమ కుటుంబాల్లో పెద్దలు ఎవరైనా మరణిస్తే వారి నేత్రాల నుంచి కార్నియాలు దానం చేసి ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించాలని కోరారు. సుదర్శి మానవతా సేవా సంస్థ నిర్వాహకులు తలశిల రఘుశేఖర్ మాట్లాడుతూ నేత్రదానం చేస్తే కన్ను మొత్తం తీసేస్తారనేది అపోహ మాత్రమేనని, కేవలం కంటిపైన ఉండే పలుచని పొరలాంటి కార్నియాలను మాత్రమే సేకరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా పక్షోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం నిర్వాహకులను ఎమ్మెల్యే మండలి బుద్ధ పసాద్ చేతుల మీదుగా శాలువాలు కప్పి సత్కరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్, విద్యాసంస్థల చైర్మన్ దుట్టా ఉమా మహేశ్వరరావు, ప్రెస్ క్లబ్ ప్రతినిధులు పుట్టి శ్రీనివాసరావు, అప్పికట్ల శ్రీనివాసరావు, ఇమ్మిడిశెట్టి వెంకట్, ప్రిన్సిపాల్ ఎన్ వీ నాగేశ్వరరావు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



## నాలుగవ రోజు కొనసాగిన నిరసన దీక్ష

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని పాత ఎడ్లంక గ్రామంలో జరుగుతున్న వరద బాధితుల నిరసన దీక్ష నాలుగవ రోజు కొనసాగింది. సోమవారం దీక్షలో పాల్గొన్న గ్రామానికి చెందిన కృష్ణాజిల్లా మాలమహానాడు అధ్యక్షుడు దోవా గోవర్ధన్ మాట్లాడుతూ సోమవారం అవనిగడ్డలో నిరసన దీక్ష చేపట్టాలని భావించినప్పటికీ పోలీసుల అనుమతి లేకపోవడం వలన గ్రామంలోనే కొనసాగిస్తున్నట్లు చెప్పారు. గత నాలుగు రోజులుగా పాత ఎడ్లంక దుస్థితిని గురించి మీడియాలో వచ్చిన కథనాలకు స్పందించి కొంతమంది అధికారులు గ్రామంలో పర్యటించి వివరాలు సేకరించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో సోమవారం గ్రీవెన్స్ డే సందర్భంగా అవనిగడ్డ తాసిల్దార్ ను కలిసి వారి సమస్యలు వివరించి ఎప్పుడు నదిలో కలిసిపోతామో తెలియని పరిస్థితులలో గ్రామంలో ఉండలేమని అవనిగడ్డ లోపల ఇళ్ల స్థలాలు కేటాయించి అందులో ఇల్లు కట్టించి ఇవ్వాలని కోరుతూ అర్జీలు సమర్పించారు. ఇటీవల వరదలకు తీవ్రస్థాయిలో గ్రామం కోత గురవుతూ అనేక నివాసాలు నదిలో కొట్టుకుపోగా మరికొన్ని నివాసాలు నది అంచున ప్రమాద స్థాయిలో ఉన్నాయని తెలిపారు. అందువల్ల సుమారు 81 కుటుంబాలు తమకు వరద ప్రమాదం పొంచి ఉందని వారు ఉంటున్న ఇళ్ళు ఇంకా కొద్ది రోజులకే కొట్టుకుపోయేలా ఉన్నాయని, వరద వచ్చినప్పుడల్లా భయంతో కాలం వెళ్లదీస్తున్నామని వాపోయారు. ఇప్పటికైనా స్పందించి అధికారులు ప్రజా ప్రతినిధులు పాత ఎడ్లంక బాధితులను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

## ఘనంగా బ్లూమింగ్ డేల్ స్కూల్ ఇన్వెస్టర్ డే వేడుకలు



**పెనమలూరు మేజర్ న్యూస్ :** విద్యార్థులు దేశ భక్తిని పెంచుకోవాలని కల్నల్ సి.ఎస్.రావు పేర్కొన్నారు. పెనమలూరులోని బ్లూమింగ్ డేల్ ఇంటర్నేషనల్ స్కూల్లో ఇన్వెస్టర్ డే వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. గ్రేడ్ 4 నుండి గ్రేడ్ 12 వరకు ఎన్నికైన విద్యార్థి మండలి సభ్యులకు నాయకత్వ బాధ్యతలను అప్పగించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కల్నల్ సి.ఎస్.రావు మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని తెలిపారు. పాఠశాల స్థాయి నుండి విద్యార్థులు సేవా భావాన్ని అలవర్చుకోవాలని సూచించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై కూడా ఆసక్తి పెంచుకోవాలని పేర్కొన్నారు. పాఠశాల స్థాయిలో ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించడం పట్ల స్కూల్ నిర్వాహకులను అభినందించారు. సభకు అధ్యక్షత వహించిన స్కూల్ ప్రిన్సిపాల్ మన్ ప్రీత్ కౌర్ మాట్లాడుతూ, బ్లూమింగ్ డేల్ స్కూల్ విద్యార్థులకు విద్యతో పాటు అన్ని రంగాలపై ఆసక్తి, అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పద్మలత, స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జ్యేష్ఠ విమలాదేవి చిత్రపటానికి నివాళి



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** జి.కొండూరు మండలం, కుంటముక్కల గ్రామం మైలవరం మాజీ శాసన సభ్యులు జ్యేష్ఠ రమేష్ బాబు మాతృమూర్తి జ్యేష్ఠ విమలాదేవి ఇటీవల మృతి చెందగా, ఈ రోజు వారి పెద్దకర్మ కార్యక్రమంలో జి.కొండూరు మండల ఎంపీపీ వేములకొండ లక్ష్మి తిరుపతమ్మ పాల్గొని వారి చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

## గ్రామాలలో పని అనుభవ కార్యక్రమం ఛాయాచిత్రం



**ఘంటసాల, మేజర్ న్యూస్ :** ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రం, ఘంటసాల వారి ఆధ్వర్యంలో సామాజిక కళాశాల విద్యార్థినీలు సోమవారం ఘంటసాల మండల పరిధి లోని కొడాలి గ్రామం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఘంటసాల పాలెం గ్రామంలో గ్రామీణ అవగాహన పని అనుభవ కార్యక్రమంలో భాగంగా కొడాలి గ్రామం, ఘంటసాల పాలెం గ్రామల నమూనా పటాలను చిత్రీకరించారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ డి సుధారాణి సందర్శించి విద్యార్థినీల ద్వారా ఆ గ్రామీణ మూలపటం యొక్క ముఖ్య ఉద్దేశాలను వివరించడం జరిగింది. అంతేకాకుండా గ్రామీణ పని అనుభవ కార్యక్రమంలో భాగంగా వారు చేయవలసిన విషయాలు గురించి గ్రామస్తులతో కూడా చర్చించారు. కె.వి.కె సిబ్బంది, గ్రామల రైతులు, మహిళలు సామాజిక విజ్ఞాన కళాశాల విద్యార్థినీలు పాల్గొన్నారు.

# కృష్ణాజిల్లా కలెక్టర్‌కి జాతీయ స్థాయి ఉత్తమ ఐఏఎస్ అవార్డు



**మన జిల్లాకు అత్యంత గర్వకారణం, స్ఫూర్తిదాయకం : జంపాన శ్రీనివాస్ గౌడ్**



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి ఎంపికైన అధికారులలో ప్రత్యేక ప్రతిభ కనబరచి ఉత్తమ ఐఏఎస్ అధికారిగా జాతీయ స్థాయి అవార్డును ఇటీవల అందుకున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం మచిలీపట్టంలోని కలెక్టరేట్‌లో యునైటెడ్ ఫోరమ్ ఫర్ యు.ఎఫ్.ఆర్టిఐ ఆధ్వర్యంలో సంస్థ కో కన్వీనర్ జంపాన శ్రీనివాస్ గౌడ్ కలెక్టర్ బాలాజీని సన్మానించారు. దేశంలో ఐఏఎస్ అధికారులకు ముస్సోరిలో నిర్వహించిన మిడ్ క్యారియర్ శిక్షణ కార్యక్రమంలో బాలాజీ నాలుగు వారాలపాటు శిక్షణ పొందారు. అన్ని విభాగాల్లో సమగ్ర ప్రదర్శన కనబర్చినందుకు ఆయనను ప్రత్యేకంగా గుర్తించి ఈ ప్రతిష్ఠాత్మక అవార్డను అందజేశారు. ఈ సందర్భంగా యు.ఎఫ్.ఆర్.టి.ఐ తరఫున జంపాన శ్రీనివాస్ గౌడ్, యు.ఎఫ్.ఆర్.టి.ఐ ప్రతినిధులు కలెక్టర్ బాలాజీకి శాలువాలు కప్పి, పుష్ప గుచ్ఛాలు అందించి, తలపాగా ధరింపజేసి, జ్ఞాపికను అభినందనలు తెలిపారు. జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ మాట్లాడుతూ,ఈ అవార్డు వ్యక్తిగత గౌరవం మాత్రమే కాదు, తన బాధ్యతల నిర్వహణలో మొత్తం జిల్లా యంత్రాంగం చేసిన కృషికి లభించిన గుర్తింపు. ఐఏఎస్ సేవ అంటే కేవలం ఉద్యోగం కాదు, దేశ సేవ చేయడానికి ఒక గొప్ప వేదిక. సమాజ అభివృద్ధికి నేరుగా తోడ్పడే అవకాశం ఇది.యువత దేశ భవిష్యత్తు కోసం ఐఏఎస్ వంటి సివిల్ సర్వీసుల్లో చేరి ప్రజల సేవ చేయాలని ఆకాంక్షిస్తున్నాను" అని అన్నారు.

సత్కార కార్యక్రమం సందర్భంగా జంపాన శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, జిల్లా అభివృద్ధి కోసం కలెక్టర్ బాలాజీ అంకిత భావంతో చేస్తున్న కృషి అభినందనీయమని, ఈ అవార్డు ఆయన మేధా సంపత్తి సామాజిక అంశాల పట్ల అవగాహనకు లభించినట్టు భావించాలి. అలాగే ఐఏఎస్‌గా పది సంవత్సరాలు పాటు అందించిన సేవలు, ఇండియా అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ ద్వారా సమాజ ఉన్నతి కోసం చేస్తున కృషికి ప్రతిఫలమని పేర్కొన్నారు. జిల్లా ప్రజలకు ఇది గర్వకారణం. ఈ సత్కారం ద్వారా యువతకు స్ఫూర్తి లభిస్తుంది, అని జంపాన శ్రీనివాస్ గౌడ్ అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో యు.ఎఫ్.ఆర్.టి.ఐ. జిల్లా అధ్యక్షులు బయ్యావరపు దుర్గా ప్రసాద్, ఉయ్యూరు మండల కన్వీనర్ బొల్లా శివపార్వతి, ప్రతినిధులు గొల్లపూడి నాగరాజు, చింతా శివ బ్రహ్మేశ్వరరావు, మానేపల్లి దేవి, బత్తుల జగన్ మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమ పథకాలను వారి దగ్గరకు చేర్చాల్సిన బాధ్యత పిఎసిఎస్ పాలకవర్గాలదే..



**పమిడిముక్కల ఆగస్టు 25 మేజర్ న్యూస్ :** రైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం అమలుపరుస్తున్న పథకాలను రైతుల దగ్గరకు చేర్చాల్సిన బాధ్యత ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల పాలకవర్గాల పై ఉందని పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. సోమవారం పమిడిముక్కల మండల పరిధిలోని గురజాడ శ్రీకృష్ణానంద ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఎమ్మెల్యే కుమార్ రాజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం అప్పుల ఊబిలో ఉన్నప్పటికీ, ఆర్థికంగా ఎంతో ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ రైతుల సంక్షేమం కోసం పలు పథకాలను అమలు చేస్తోందన్నారు. రైతులకు వ్యవసాయ పెట్టుబడి కింద కేంద్ర ప్రభుత్వంతో కలిసి తొలివిడతగా 7000 రూపాయల నగదును ఇప్పటికే వారి ఖాతాలలో జమ చేయడం జరిగిందన్నారు. అంతేకాక రైతులకు సాగునీటి కష్టాలు తొలగించేందుకు నీటి సంఘాలను ఏర్పాటు చేసి ఆ సంఘాల ద్వారా పంట కాలువలు, మురుగు కాలువలకు మరమ్మతుల పనులను చేపట్టిందన్నారు. ప్రస్తుతం రైతుల అవసరాలను సకాలంలో తీర్చేందుకు సహకార సంఘాలకు తాత్కాలికంగా త్రీ మెన్ కమిటీ పాలకవర్గాలను ఏర్పాటు చేసిందన్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో రైతులు ఎటువంటి ఇబ్బందులకు గురికాకుండా సకాలంలో వారికి సహకార సంఘాల ద్వారా రుణాలు అందించడంతోపాటు, అవసరమైన ఎరువులను ఇబ్బంది గురిపెట్టకుండా అందించాలని విజ్ఞప్తి చేశారు. గత ఏడాది రైతులు పండించిన ధాన్యానికి నగదు చెల్లింపుల విషయంలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టి గంటల వ్యవధిలోనే వారి ఖాతాలకు జమ చేయడం జరిగిందనే విషయాన్ని ఈ సందర్భంగా రైతులకు గుర్తు చేశారు. ఈ ఏడాది కూడా ప్రస్తుతం సాగవుతున్న వరికి సంబంధించి అంచనాలను రూపొందించడం ద్వారా ముందుగానే ధాన్యం కొనుగోలుకు సంబంధించిన ఏర్పాట్లు కూడా ప్రభుత్వం ఇప్పటి నుంచే ప్రారంభించిందని తెలిపారు. పిఎసిఎస్ నూతన చైర్మన్ గా కొండేటి సత్యనారాయణ, సభ్యులుగా మేరుగ శివరామకృష్ణ ప్రసాద్, కూచిపూడి సావిత్రమ్మ బాధ్యతలు చేపట్టారు. నూతన పాలకవర్గ సభ్యులను ఈ సందర్భంగా ఆయన అభినం దిస్తూ రైతులకు తమ పరిధిలో ఉత్తమ సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు రాజులపాటి శ్రీనివాసరావు, జనసేన పార్టీ పామర్రు నియోజకవర్గ ఇన్చార్జ్ తాడిచెట్టి నరేష్‌లతోపాటు పలువురు నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.



## సీఎంఆర్ఎఫ్ చెక్కు అందించిన ఎమ్మెల్యే కుమార్ రాజా

**పెదపారుపూడి ఆగస్టు 25 మేజర్ న్యూస్:** మండల పరిధిలోని యలమర్రు గ్రామంలో దారం భాగ్యరేఖ కు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన ఆర్థిక సహాయం చెక్కును పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా సోమవారం అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స చేయించుకున్న భాగ్యరేఖకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన 25,541 రూపాయల చెక్కును ఎమ్మెల్యే స్వయంగా లబ్ధిదారుని ఇంటికి వెళ్లి అందించారు. ఈ కార్యక్రమంలో పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను ముంచారు

## నియోజకవర్గం కన్వీనర్ ఉప్పాల రాము



**బంటుమిల్లి మేజర్ న్యూస్ :** ఎన్నికలలో కూటమి నాయకులు మోస పూరిత వాగ్దానాలతో ప్రజలు నమ్మించి నట్టేట ముంచారని వైఎస్ఆర్ పార్టీ పెడన నియోజవర్గం కన్వీనర్ ఉప్పాల రాము ఆరోపించారు. ఆదివారం సాయంత్రం స్థానిక గీత మందిరం ఆవరణలో మండల అధ్యక్షులు ముత్యాల నాగేశ్వర రావు ఆధ్వర్యంలో బాబు షూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం పై పార్టీ విస్తృత స్థాయి సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వహించి సభలో వైఎస్ఆర్ సీపీ. పెడన నియోజకవర్గం కన్వీనర్ ఉప్పాల రాము మాట్లాడుతూ అభివృద్ధి కార్యక్రమాలకు తాము మంజూరు నిధులను వారు శిలాఫలకాలు వేయించుకొని ప్రచారం చేసుకొంటున్నారని ఎద్దేవా చేశారు. కూటమి నాయకులు సూపర్ సిక్స్ పేరుతో మోసపూరమైన వాగ్దానం చేసి అధికారం వచ్చారని, అధికార దుర్వినియోగం చేసి వైఎస్ఆర్ పార్టీ నాయకులను, కార్యకర్తలను ఇబ్బందులు గురి చేస్తున్నారని ఆరోపించారు. దివంగత నేత తన తండ్రి ఉప్పల రాంప్రసాద్ పై అవాస్తవాలు మాట్లాడుతూ నిందలు మోపుతున్నారని అన్నారు. పంటలకు యూరియా సరఫరా చేయకుండా రైతుల నడ్డి విరుస్తున్నారని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలోమండల పరిషత్ అధ్యక్షులు వెలివేల చినబాబు, జడ్.పి.టి.సి.సభ్యులు మలిశెట్టి.వెంకట రమణ, తిరుమాని శ్రీనివాసరావు, బండారు చంద్రశేఖర్, ఒడిమి చిన్నారిబాబు, కమల్ భాషా, జల్లా భూపతి, పాము పుష్ప, వైఎస్ఆర్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



## లబ్ధిదారురాలికి సీఎంఆర్ఎఫ్ చెక్కు అందించిన ఎమ్మెల్యే

**పమిడిముక్కల ఆగస్టు 25 మేజర్ న్యూస్ :** పమిడిముక్కల మండలం గురజాడ గ్రామానికి చెందిన షేక్ ఫరీదా బేగం శస్త్రచికిత్స చేయించుకుని ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా మంజూరైన ఆర్థిక సహాయం చెక్కును స్థానిక శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా సోమవారం ఆమె ఇంటికి వెళ్లి స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆమెను కుశల ప్రశ్నలు అడిగి శస్త్రచికిత్స చేయించుకున్న పరిస్థితులను, ఆర్థిక ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన 51,334 రూపాయల చెక్కును ఫరీదా బేగంకు అందించారు. ఈ సందర్భంగా ఆమె తన భర్త చనిపోయి రెండు సంవత్సరాలైందని, ఇప్పటివరకు పెన్షన్ రావడంలేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా ఆయన స్పందించి త్వరలో నూతన పింఛన్ల మంజూరు సమయంలో తప్పనిసరిగా ఆమెకు పింఛను మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. అలాగే ఎటువంటి ఇబ్బందులు ఉన్నా స్థానిక నాయకుల దృష్టికి సమస్యను తీసుకువెళ్ళటం ద్వారా పరిష్కరింప చేసుకోవాలని ఆమెకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రాజులపాటి శ్రీనివాసరావు తోపాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరికి స్మార్ట్ రేషన్ కార్డు అందేలా చూడండి



**పమిడిముక్కల మేజర్ న్యూస్ :** మండలంలోని ప్రతి రేషన్ కార్డుదారునికి స్మార్ట్ రేషన్ కార్డు అందించాలని తాసిల్దార్ సిహెచ్.నవీన్ కుమార్ విజ్ఞప్తి చేశారు. మండల పరిధిలోని 41 రేషన్ దుకాణాల పరిధిలో 17,374 రేషన్ కార్డులు ఉండగా వీరందరికీ అందించేందుకు నూతన స్మార్ట్ కార్డులు వచ్చాయన్నారు. వీటిని గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి గ్రామ రెవెన్యూ అధికారులు ప్రతి లబ్ధిదారునికి అందించాలని సూచించారు. ప్రతి ఇంటికి ఈ కార్డు చేరే విధంగా చూడడంతో పాటు ఈ కార్డు యొక్క విశి ష్టతలను గూర్చి లబ్ధిదారులకు వివరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అనం తరం పమిడిముక్కలలో రేషన్ కార్డుల పంపిణీ ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సునీత, కృష్ణాపురం డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ నాదెళ్ళ సుబ్రహ్మణ్యం, తెలుగుదేశం పార్టీ నాయకులు, రెవెన్యూ కార్యాలయ సిబ్బంది, మండలంలోని విఆర్వోలు, చౌక ధరల దుకాణాల డీలర్లు పాల్గొన్నారు.

## 28న ఆంజనేయ స్వామి హుండీ లెక్కింపు



**పామర్రు ఆగస్టు 25 మేజర్ న్యూస్ :** పామర్రు మండలం ఉండ్రపూడి – పోలవరం అడ్డరోడ్డు వద్ద వేంచేసి ఉన్న శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానం హుండీ లెక్కింపును ఈనెల 28న చేపడుతున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి పి.వి.ఎన్.వి. ప్రసాదరావు తెలిపారు. దేవదాయ ధర్మాదాయ శాఖ గుడివాడ తనిఖీ అధికారి పర్యవేక్షణలో ఆ శాఖ అధికారులు, భక్తుల సమక్షంలో 28వ తేదీ గురువారం ఉదయం 10:30 గంటలకు హుండీల లెక్కింపు కార్యక్రమం జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చునని ప్రసాద్ రావు తెలిపారు.

విలేకరులు కావలెను
నేటి దినపత్రిక సూర్య నందు
చందర్లపాడు, ఇబ్రహీంపట్నం, మైలవరం,
గంపలగూడెం మండలాల్లో పని
చేయుటకు విలేకరులు కావలెను.
ఇట్లు
ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999